క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ కళైవాణి

కార్వేటినగరం: ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ నగరి మేనేజర్ పీఎం కళైవాణి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ అలాగే చిత్తూరు జిల్లా స్టెప్స్ నగరి స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత, అధ్యాపకులు, స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పీ4పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ మనోహర్‌గౌడ్

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో పీ-4 కార్యక్రమానికి సంబంధించి మొబైల్ అప్లికేషన్స్‌పై మండలంలోని సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సచివాలయ సిబ్బంది పీ4 కార్యక్రమం అమలుపై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ లోకేష్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ శివయ్య, పీ4 కార్యక్రమ కోఆర్డినేటర్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి

వెదురుకుప్పం: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణచైతన్య సూచించారు. మంగళవారం వెదురుకుప్పంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అవగాహన లేమితో అనేక వ్యాధుల బారిన పడుతుంటారని తెలిపారు. అనంతరం మహిళలకు పలురకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శిల్ప, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న జయశ్రీ

పాలసముద్రం : చిన్న వయసు నుంచే పిల్లలకు సరైన పోషకాహారాన్ని అందించడం వల్ల ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ తెలిపారు. మంగళవారం బలిజకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషక మాసోత్సవాల్లో హాజరై అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణీ, బాలింతలతో ఆమె మాట్లాడుతూ ఊబకాయం ఉన్న పిల్లలకు నూనె, చక్కెర వాడకాన్ని తగ్గించాలన్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తినడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహార పదార్థాలను విధిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బలిజకండ్రిగలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్



మాట్లాడుతున్న డాక్టర్ జయకుమార్,

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ ఉన్నత పాఠశాలలో గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారులు మోహన్‌కృష్ణ, జయకుమార్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి జయకుమార్ మాట్లాడుతూ గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల వృద్ధిని నివారించవచ్చన్నారు. గర్భిణులు ప్రసవం వరకు మంచి ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రసవం ప్రభుత్వాస్పత్రిలోనే చేయించుకుంటే తల్లీబిడ్డలు సురక్షితంగా ఉంటారని తెలిపారు. అనంతరం 105 మందికి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

టీకాలు వేయించుకోండి

నిండ్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్య సౌందర్య అన్నారు. మంగళవారం కొప్పేడులో టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలు బుధవారం నుంచి అక్టోబర్ 15 తేదీ వరకు వేయనున్నట్లు తెలిపారు. పాడి ఆవులకు పాల దిగుబడి తగ్గడం, జర్వం, సొంగ కారడం, కుంటడం తదితర లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్య సేవలు అందించాలని కోరారు.



చిన్నకనుమలోని ప్రమాద కరమైన మలుపు వద్ద తిరుగుతున్న బస్సు



చిన్నకనుమ వద్ద బోల్తా పడిన లారీ(ఫైల్)

ప్రాణాలు పిండేస్తున్నాయి..!

పచ్చికాపల్లం– కార్వేటినగరం రహదారి.. మధ్యలో రెండు కనుమలు.. మలుపులు.. ఇవి ప్రమాద పిలుపులుగా మారాయి. పెద్ద, చిన్న కనుమలు మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. వాహనచోదకుల నిర్లక్ష్యం..పలువురికి మార్గంపై అవగాహన లేమి.. వెరసి పలువురి కుటుంబాల్లో చీకట్లు నింపుతున్నాయి. ఈ రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఉంది.

- మలుపుల్లో కనిపించని సూచిక బోర్డులు
- వాహన చోదకులకు దినదిన గండంగా పెద్దకనుమ

కార్వేటినగరం: నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పచ్చికాపల్లం– కార్వేటినగరం రోడ్డులోని పెద్దకనుమ, చిన్న కనుమ అంటే వాహన చోదకులకు వణుకు పుడుతోంది. గతంలో కార్వేటినగరానికి మూడు వైపులా మృత్యు మలుపులు ఉండేవి. ఎప్పుడు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయోననే భయం నగర వాసులను పీడిస్తుండేది. అయితే పదేళ్ల కిందట రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా కలికిరిండ్లు, కుప్పానిగుంట పెద్ద కనుమలను తొలగించి మలుపు లేకుండా చేశారు. అయితే కార్వేటినగరం–పచ్చికాపల్లం మార్గంలో కిలో మీటరు దూరంలో ప్రమాదకరంగా ఉన్న పెద్ద కనుమ, చిన్నకనుమలు మాత్రం అలాగే ఉండడంతో నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. 30 ఏళ్ల కాలంలో సుమారు 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది తీవ్రగాయాలపాలై, దివ్యాంగులయ్యారు. ఈ రహదారిలో పెద్ద కనుమ సుమారు 100 మీటర్ల ఎత్తులో ఉంది. కార్వేటినగరం తమిళనాడుకు సరిహద్దులో ఉండడంతో 90 శాతం మంది తిరుపతికి వెళ్లే వాహన చోదకులు కార్వేటినగరం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వచ్చే వాహనాలే అత్యధికంగా ప్రమాదాలకు గురవుతుంటాయి. డ్రైవర్లు ఎంత నెమ్మదిగా వాహనం నడిపినా ఎత్తు ప్రదేశం నుంచి పల్లానికి వేగంగా నెట్టేస్తోంది. వేగాన్ని ఎంత నియంత్రించినా క్షణాల్లో ప్రమాదాలు జరిగి పోతున్నాయి. దీనికితోడు కొందరు డ్రైవర్లు తప్పతాగి వాహనాలు నడపడంతో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఉదాహరణలివీ..

- 27 ఏళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల సమయంలో బహుజనపార్టీ(బీఎస్పీ) కార్యకర్తలకు చెందిన ప్రచార లారీ పచ్చికాపల్లంలో ప్రచారం నిర్వహించుకుని కార్వేటినగరం వెళుతుండగా పెద్ద కనుమ వద్ద బోల్తా పడిన ప్రమాదంలో 15 మంది మృత్యువాత పడ్డారు.
- 2011లో రాయలచెరువు నుంచి తమిళనాడుకు వెళుతున్న ఓ పెళ్లి లారీ చిన్న కనుమ వద్ద అదుపు తప్పి బోల్తాపడడంతో సుమారు 9 మంది మృతి చెందారు. దీంతో మృత దేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి.సుమారు 30 మందికి గాయాలయ్యాయి.



గాండ్లోళ బాయి మలుపు వద్ద కోతకు గురైన రోడ్డు

బోల్తా పడుతున్న వాహనాలు

చిన్నకనుమ మలుపు వద్ద హెవీ లోడ్‌తో వచ్చే టిప్పర్లు బోల్తా పడుతున్నాయి. ఇదే మార్గంలో జగనన్న కాలనీకి ఎదురుగా ఉన్న గాండ్లోళ బాయి మలుపు వద్ద రోడ్డు కోతకు గురై మరింత ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి ప్రమాదాలకు నిలయంగా మారుతున్న పెద్దకనుమ, చిన్నకనుమ, గాండ్లోళ బాయి మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరణ చేసి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా సమగ్రశిక్షా ఏపీసీ

నగరి : దివ్యాంగులు ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమగ్రశిక్షా ఏపీసీ మద్దిపట్ల వెంకటరమణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌జీఎస్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో దివ్యాంగ పిల్లలకు భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలింకో) వైద్యుల సహకారంతో నిర్వహించిన మెడికల్ అసెస్మెంట్ క్యాంప్‌లో పాల్గొన్నారు. ఈ క్యాంపులో 80 మంది పిల్లలు వారి తల్లిదండ్రులతోపాటు హాజరయ్యారు. వారికి ప్రత్యేక వైద్యనిపుణులు వైకల్య నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగ పిల్లలందరూ ప్రభుత్వం అందించే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో గత వారం రోజులుగా జరిగినటువంటి అసెస్మెంట్ క్యాంపు నందు 525 మంది దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొని డాక్టర్లతో పరీక్షలు చేయించుకున్నారన్నారు. నగరి ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం, సహిత విద్య సమన్వయకర్త జగ్గ మధు, ప్రధానోపాధ్యాయిని పార్వతి, అసిస్టెంట్ ఏఎంఓ సుభాషిణి, ఏఎస్ఓ చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం



స్టాల్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ భువనేశ్వరి, సూపర్‌వైజర్ రోజారమణి

కార్వేటినగరం: ఆరోగ్యకరంగా ఉండాలంటే చిరుధాన్యాలు తప్పనిసరి ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రోజారమణి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గాజంకి సచివాలయంలో పోషణ్ మా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో దోహద పడుతాయన్నారు. ఆకుకూరలు, కూరగాయలతో పాటు అందుబాటులో ఉండే సీజనల్ పండ్లను తప్పకుండా తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులకు దూరంగా ఉంటారని చెప్పారు. అనంతరం కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ముందస్తుగా చికిత్స పొందాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికారం స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరోహరరెడ్డి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పంటలు సాగు చేయండి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్

నగరి : రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని తెరణి, మిట్టపాళెం గ్రామాల్లో వ్యవసాయ అధికారి రాఘవేంద్రయాదవ్ ఏర్పాటు చేసి ‘పొలం పిలుస్తుంది’ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పచ్చి రొట్ట పంటలైన జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద తదితర పంటలను సాగు చేసి, భూములను సారవంతం చేసుకోవాలన్నారు. వేరుశనగ, వంగ, బెండ, చెరుకు పంటలో ఆశించే పురుగులు, తెగుల నివారణ కోసం సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అవలంబించాలన్నారు. వేరుశనగ, బెండ, వంగ పంటలో రసం పీల్చే పురుగుల నివారణ కోసం పసుపు, నీలిరంగు జిగురు అట్టలు ఎకరాకి 25 చొప్పున పెట్టుకోవాలన్నారు. కాండం, కాయ తొలిచే పురుగుల నివారణ కోసం ఎకరాకు పది చొప్పున లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవాలన్నారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవ ఎరువులు, పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా జీవ సంబంధమైన మందులు పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వీఏఏ, తరుణ్ పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న డీఐఓఎస్ రవిశేఖర్

పాలసముద్రం : రీసర్వేపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే (డీఐఓఎస్) రవిశేఖర్ తెలిపారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో మండల పరిధిలోని విలేజ్ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూముల సమస్యలపై సంబంధిత లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ భూములు, డీకేటీ పట్టాలు నమోదు పూర్తి అవగాహనతో చేయాలన్నారు. కొత్త సర్వే రికార్డుల నిర్వహణలో భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు రాకుండా నంబర్లు నమోదు చేయాలని సూచించారు. రీసర్వేతో కలిగే సమస్యలపై రైతులు అప్పీల్ చేసుకోవడానికి యాప్‌లో ప్రత్యేకంగా లాగిన్ చేయాల్సి ఉంటుందన్నారు. మండలంలో ఏఏ గ్రామాల్లో రీసర్వే జరుగుతుందో తెలుసుకునేందుకు సైతం యాప్ దోహదపడుతుందన్నారు. మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని భూముల వివరాలు భూస్థితి పక్కాగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న అన్నాలోకనాథం

పుత్తూరు: తడుకు పంచాయతీ ఎగువ గూళూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వై.జయరామయ్య మంగళవారం ఆకస్మికంగా మృతి చెందాడు. పుత్తూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు అన్నాలోకనాథం ఆ గ్రామానికి వెళ్లి జయరామయ్య మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామూర్తి, బుజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన మహిళా సమైఖ్య కార్యవర్గం

పాలసముద్రం : మండల మహిళా సమైఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి సమీక్షంలో స్త్రీశక్తి భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా భాగ్య, కార్యదర్శిగా మంజుల, కోశాధికారిగా మహాలక్ష్మి ఎన్నికయ్యారు. ఆర్థిక రుణ ప్రణాళిక తయారు చేసుకున్నారు. సమావేశంలో గత వార్షిక సంవత్సరంలో ప్రగతి నివేదిక చదివి వినిపించారు. ఏపీఎం కల్పలతరెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగడానికి ఆర్థిక చేయూత అందించడానికి మహిళా సమైఖ్య సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలతో కూడిన పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘ సభ్యురాలు ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు చింజీవి, సంఘమిత్రలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్నా, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆశ సిబ్బందులు

శ్రీరంగరాజపురం : కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ఆశావర్కర్లతో కలసి డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మండల తహసీల్దార్ లోకనాథపిళ్లెక్కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి మూడు నెలలకే ఆశా వర్కర్లకు జీతాలు పెంచుతామని నమ్మించి.. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటుతున్నా అతీగతీ లేదన్నారు. ఇప్పుడు జరుగుతున్న శాసనసభ సమావేశంలో ఆశా వర్కర్లకు జీతాలు పెంచుతున్నట్లు తీర్మానం చేయాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్మిక యూనియన్ సంఘాలతో కలసి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమానికి ఆశా వర్కర్ జిల్లా యూనియన్ కార్యదర్శి చంద్రకళ, ఏఐటీయూసీ నియోజవర్గం కార్యదర్శి గోవిందయ్య, నాయకులు పాల్గొన్నారు.

దేవీ అలంకారం.. దేదీప్యమానం



గాయత్రీ దేవి పూజలో మాజీ మంత్రి ఆర్కేరోజా



బ్రహ్మచారిణి అలంకరణలో కామాక్షీ దేవిని ఊరేగిస్తున్న ఆలయ నిర్వాహకులు

నగరి: నియోజకవర్గంలోని దేవీ ఆలయాల్లో మంగళవారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. నేత్రప్రదాయిణి దేశమ్మ దేవత గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి అమ్మవారికి బ్రహ్మచారిణి అలంకరణ చేశారు. సత్రం దక్షిణ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ద్రాక్షాయణి అలంకారం చేయగా, మూలవర్లకు స్వర్ణ అలంకారం చేశారు.

గాయత్రీదేవికి మాజీ మంత్రి ఆర్కేరోజా పూజలు

మాజీ మంత్రి ఆర్కేరోజా దసరా ఉత్సవాల్లో భాగంగా స్వగృహంలో గాయత్రీ దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. అందరికీ శుభం కలగాలని వేడుకున్నారు. అందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలత్రిపుర సుందరిగా మహాలక్ష్మి

నిండ్ర: మండలంలోని కేఅర్ పాళెంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు.

కార్వేటినగరం: మండలకేంద్రంలోని బంగారమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం బాలత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి సీఎస్ ఉదయ్‌కుమార్, సీఎస్ నందకుమార్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. డైట్ సమీపంలోని అంకాళపరమేశ్వరి ఆలయం, ఆళత్తూరు గ్రామ సమీపంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయం, కొల్లాగుంట సమీపంలోని పడివేటమ్మ ఆలయం, పాదిరికుప్పంలోని గంగమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శైలపుత్రికగా ఆరిమాని గంగమ్మ

శ్రీరంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లిలో ఉన్న ఆరిమాని గంగమ్మ ఆలయంలో అమ్మవారు శైలపుత్రికగా దర్శనమిచ్చారు. వంశపార్యంపరంగా తాతిరెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. ఎంపీపీ సరిత, స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యులు ఆదిలక్ష్మి, ఈఓ వెంకటరావు, ధర్మకర్త లింగారెడ్డి, కమిటీ సభ్యులు మునికృష్ణ పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు : శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గంగాధర నెల్లూరులోని అల్లియల్లమ్మ పార్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి రమేష్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ మాజీ ధర్మకర్తలు రవీంద్రారెడ్డి, పార్థసారథి రెడ్డి, గుణశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

తపస్సు కామాక్షీదేవిగా ఆరేటమ్మ

పుత్తూరు: పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని ఆరేటమ్మను తపస్సు కామాక్షి దేవిగా అలంకరించి కొలువు దీర్చారు. ద్రౌపదీదేవిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తుల దర్శన భాగ్యం కల్పించారు.

గాయత్రీదేవిగా గంగాదేవి

పాలసముద్రం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నొచ్చిలిలో ఉన్న పరమేశ్వర సమేత గంగాదేవి గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే అదే గ్రామంలోని గిరిరాజ కన్యకా పరమేశ్వరిదేవికి కామాక్షిదేవి అలంకారం చేశారు. బలిజకండ్రిగలోని చెవుటి గంగమ్మకు పుష్పాలంకరణ చేశారు. అలాగే మండంలోని పడవేటమ్మ తల్లి సరస్వతిగా, పార్వతిదేవిని గాయత్రీదేవి అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.



పాలసముద్రం: చెవిటి గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు





గాయత్రీదేవిగా గంగాదేవి,కామాక్షిగా గిరిరాజ కన్యకా పరమేశ్వరి



గాయత్రిగా దేశమ్మ, బాలత్రీపుర సుందరిగా మహాలక్ష్మి, శైలపుత్రికగా ఆరిమాని గంగమ్మ , ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ, బాలాత్రిపుర సుందరిగా అంకాళపరమేశ్వరి , పార్వతి దేవిగా అల్లియల్లమ్మ, గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి, పుత్తూరు: తపస్సు కామాక్షిదేవిగా ఆరేటమ్మ ,లక్ష్మీదేవి అలంకరణలో ద్రౌపదీదేవి, పాలసముద్రం: లలితాదేవిగా పడవేటమ్మ

భారతీయ వైద్యానికి పునాది ఆయుర్వేదం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: ఆరోగ్య భారతావనికి పునాది ఆయుర్వేదమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ వైద్య పితామహుడు ధన్వంతరి జయంతిని ఆయుర్వేద దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. మన ఆయుర్వేద వైద్యాన్ని విదేశాల్లో సైతం ఆదరిస్తున్నారని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ మన్యం నరసింహులు, వృక్ష శాస్త్ర విభాగపతి కోటేశ్వరరావు, అధ్యాపకులు పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాసం విత్తనాల పంపిణీ

వెదురుకుప్పం: రైతులకు పశుగ్రాస విత్తనాలను రాయితీపై ఇస్తున్నట్లు వెదురుకుప్పం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు రూపసుందరి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 2250 కేజీలు మొక్కజొన్న విత్తనాలు, 700 కేజీల హైబ్రిడ్ మల్టీకట్ ఎర్రజొన్న విత్తనాలు పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. మార్కెట్ రేట్ ప్రకారం కిలో మొక్కజొన్న విత్తనాలు రూ.68 కాగా ప్రభుత్వం రూ.17 రాయితీపై ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఎర్రజొన్నలు కిలో రూ.92 కాగా ప్రభుత్వం రాయితీ ద్వారా రూ.23కు అందిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులు తెచ్చి విత్తనాలు తీసుకోవచ్చన్నారు.